## తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

- సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశాలు
- జూన్ రెండో తేదీ వేడుకలపై సన్నాహక సమావేశం
- ప్రముఖుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



**జనగామ, మే 25 తరంగాలు :**
తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించే విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ బెన్షాలోంతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. జూన్ రెండో తేదీన జరగనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చెత్తాచెదారం తొలగించి, పిచ్చి మొక్కలను శుభ్రం చేసి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు. వివిధ శాఖల తరపున ప్రత్యేక ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అతిథులకు ఆహ్వాన పత్రాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్వహణ నియమాలను పాటిస్తూ ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ఇతర అతిథుల కోసం ప్రత్యేక సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశ ప్రతులను సంబంధిత అధికారులు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని తెలిపారు. వేడుకల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని స్పష్టం చేశారు. అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచాలని, తాగునీరు, అల్పాహారం వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. అమరవీరుల స్థూపం, వేదిక, పూలమొక్కల అలంకరణ, తివాచీలు, బ్యారికేడ్ల ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. పోలీసు బందోబస్తు, గౌరవ వందనం, పోలీసు బ్యాండ్ కార్యక్రమాలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా, మండల స్థాయిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసు కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని కలెక్టర్ తెలిపారు. విద్య, మహిళా సంక్షేమం, యువజన, క్రీడల శాఖలు బహుమతుల ప్రదానం, ఉద్యోగ మేళాలు, ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఎరువుల దుకాణాల కేటాయింపుకు సంబంధించిన వర్చువల్ ప్రారంభోత్సవ ఏర్పాట్లు కూడా సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థిని హత్యాచారం కేసులో ద్వంద్వ మరణశిక్ష

- పోక్సో కోర్టు కీలక తీర్పు
- దోషిపై కఠిన చర్యలు
- తమిళనాడులో సంచలనం రేపిన ఘటన



**చెన్నై, మే 25 తరంగాలు :** తమిళనాడులో సంచలనం సృష్టించిన పన్నెండో తరగతి విద్యార్థిని హత్యాచారం కేసులో పోక్సో ప్రత్యేక న్యాయస్థానం కీలక తీర్పును వెలువరించింది. విద్యార్థినిపై అత్యాచారం చేసి అనంతరం హత్య చేసిన ధర్మ మునీశ్వరన్ అనే నిందితుడికి రెండు మరణశిక్షలు విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. ఈ కేసును అరుదైన నేరంగా పేర్కొంటూ అత్యంత కఠిన శిక్ష విధిస్తున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. విచారణలో నిందితుడు విద్యార్థినిపై అత్యంత దారుణంగా ప్రవర్తించినట్లు తేలిందని న్యాయస్థానం పేర్కొంది. బాధితురాలిపై అత్యాచారం చేయడమే కాకుండా హత్యకు పాల్పడటం తీవ్ర నేరమని అభిప్రాయపడింది. సమాజంలో మహిళలు, బాలికల భద్రతకు భంగం కలిగించే ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు అవసరమని కోర్టు వ్యాఖ్యానించినట్లు సమాచారం. విలాతికుళం సమీపంలోని వేదనాథం గ్రామానికి చెందిన పన్నెండో తరగతి విద్యార్థిని మార్చి పదో తేదీ సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, మరుసటి రోజు అటవీ ప్రాంతంలో ఆమె మృతదేహం తీవ్ర గాయాలతో లభ్యమైంది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. పోలీసులు వెంటనే స్పందించలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ కేసులో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు స్థానిక ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా మార్చి పంతొమ్మిదిన నిందితుడిని అరెస్టు చేశారు. దర్యాప్తులో నిందితుడికి గతంలోనూ పలు నేరాలతో సంబంధం ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం నిందితుడు గతంలో ఓ వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో కూడా నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన సమయంలోనే విద్యార్థినిపై ఈ దారుణానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఈ విషయాన్ని కోర్టు కూడా తీవ్రంగా పరిగణించినట్లు తెలిసింది. ఈ తీర్పుతో బాధిత కుటుంబానికి న్యాయం జరిగిందని పలువురు అభిప్రాయపడ్డారు. మహిళలపై నేరాలకు పాల్పడేవారికి ఇది గట్టి

# మహిళల భద్రతకు పోష్ చట్టం

- కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం
- వేధింపులపై కఠిన చర్యలు
- ప్రతి కార్యాలయంలో ఫిర్యాదుల కమిటీ తప్పనిసరి

**ములుగు, మే 25 తరంగాలు :**
పని ప్రదేశాల్లో మహిళలకు పోష్ చట్టం రక్షణ కవచంలా పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. తొంభై తొమ్మిది రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 25 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో భాగంగా "మహిళల భద్రత - రక్షణ" కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు పని ప్రదేశాల్లో గౌరవంగా, భయభ్రాంతులు లేకుండా పనిచేసే వాతావరణం కల్పించడం ప్రతి సంస్థ బాధ్యత అని అన్నారు. మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం మహిళా ఉద్యోగులకు రక్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. ప్రతి కార్యాలయంలో పది మందికి పైగా ఉద్యోగులు ఉంటే అంతర్గత ఫిర్యాదుల కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వేధింపులకు గురైన మహిళలు మౌనంగా ఉండకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, బాధితులకు న్యాయం జరిగేలా నిర్దేశిత గడువులో చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోష్ చట్టంపై ప్రతి ఉద్యోగికి అవగాహన కల్పించాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. మహిళా ఉద్యోగుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదన్నారు. ఎక్కడైనా ఉల్లంఘనలు జరిగితే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని కోరారు. మహిళలు షీ టీమ్స్, భరోసా కేంద్రాల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మహిళా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. మహిళల హక్కులు, భద్రత, చట్టపరమైన రక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలపై వేధింపుల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు పిలుపునిచ్చారు.





# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- జనగామలో ప్రజావాణి నిర్వహణ
- ప్రజల నుంచి ఐదు వందల యాభై వినతులు
- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

**జనగామ, మే 25 తరంగాలు :**
ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ తెలిపారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బెన్షాలోంతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలను జిల్లా కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. భూ సమస్యలు, పెన్షన్లు, ఉపాధి, సంక్షేమ పథకాలు, తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి పలు అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా విని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కలెక్టర్ తెలిపారు. అర్జీదారుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సత్వర సేవలు అందించడం ప్రతి శాఖ బాధ్యత అని స్పష్టం చేశారు. నేటి ప్రజావాణిలో మొత్తం ఐదు వందల యాభై దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖలకు పంపించి గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన పలువురు ప్రజలు తమ సమస్యలను నేరుగా కలెక్టర్‌కు వివరించే అవకాశం లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజల సమస్యలపై స్పందిస్తున్న తీరు పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయనే నమ్మకం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణాధికారి రంగారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల సమస్యలను సమగ్రంగా నమోదు చేసి పరిష్కార దిశగా చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.





# మళ్లీ పెరిగిన ఇంధన ధరలు

- పెట్రోల్, డీజిల్‌పై మరోసారి భారీ భారము
- రెండు వారాల్లో నాలుగోసారి పెంపు
- కేంద్రంపై ఖర్గే తీవ్ర విమర్శలు

**న్యూఢిల్లీ, మే 25 తరంగాలు :**
అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వరంగ చమురు సంస్థలు మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచాయి. తాజా పెంపుతో లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున భారము పడింది. గత రెండు వారాల్లోనే ఇంధన ధరలు పలుమార్లు పెరగడంతో దేశవ్యాప్తంగా సామాన్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజా ధరల ప్రకారం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12కు చేరుకోగా, డీజిల్ ధర రూ.95.25గా నమోదైంది. హైదరాబాద్‌లో పెట్రోల్ ధర రూ.115.58, డీజిల్ ధర రూ.103.74కు పెరిగింది. ఇంధన ధరల పెరుగుదలతో రవాణా వ్యయాలు మరింత అధికమయ్యే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన సమయంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ప్రజలపై అదనపు భారం మోపుతున్నదని అభిప్రాయపడుతున్నారు. రైతుల నుంచి చిన్న వ్యాపారుల వరకు ప్రతి వర్గం ఈ ప్రభావాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. సరుకు రవాణా ఖర్చులు పెరగడంతో మార్కెట్ ధరలు కూడా మరింత పెరిగే పరిస్థితి కనిపిస్తున్నది. మల్లికార్జున ఖర్గే ఇంధన ధరల పెరుగుదలపై కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో రోజురోజుకూ ఇంధన భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సామాన్య ప్రజల పొదుపును తగలబెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రెండు వారాల్లోనే నాలుగుసార్లు ధరలు పెరగడం ప్రజలపై ఆర్థిక దాడిలాంటిదని వ్యాఖ్యానించారు. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా లాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. 2014లో లీటర్ పెట్రోల్ ధర రూ.71.41గా ఉండేదని, ప్రస్తుతం అది రూ.102 దాటిందని ఖర్గే గుర్తు చేశారు. గత పన్నెండేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఇంధనంపై లక్షల కోట్ల రూపాయలు వసూలు చేసిందని విమర్శించారు. చమురు సంస్థల లాభాల కోసం సామాన్యులపై భారం మోపుతున్నారని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరగడంతో ప్రభుత్వరంగ చమురు సంస్థల వాటాల విలువలు కూడా పెరిగినట్లు తెలిపారు. ఇంధన ధరల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా వ్యవసాయం, పరిశ్రమలు, చిన్న వ్యాపారాలపై కూడా తీవ్రంగా పడుతున్నదని విశ్లేషకులు చెబుతున్నారు. రైతుల సాగు వ్యయాలు పెరగడంతో పాటు సూక్ష్మ, చిన్న పరిశ్రమలపై కూడా అదనపు భారము పడుతున్నది. ప్రజల అవసరాల కంటే ఆదాయ వసూళ్లకే కేంద్రం ప్రాధాన్యం ఇస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇంధన ధరల నియంత్రణపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని దేశవ్యాప్తంగా డిమాండ్లు వినిపిస్తున్నాయి.



## విద్యుత్‌పై కేంద్రంతో ఒప్పందం చేసుకున్నది బీఆర్ఎస్సే...

- టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ వెల్లడి

**హైదరాబాద్, మే 25,తరంగాలు :**
సమగ్ర విద్యుత్ సరఫరా పథకంలో తెలంగాణ ప్రభుత్వం చేరడంపై బీఆర్ఎస్ నాయకులు ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 2017 జనవరి 4న ఇదే బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో ఢిల్లీలో ఒప్పందం చేసుకున్నదని ఆయన వివరించారు. ఆ ఒప్పందంపై కేంద్రం నుంచి జాయింట్ సెక్రటరీ డాక్టర్ అరుణ్ కుమార్ వర్మ, అండర్ సెక్రటరీ నరేందర్ సింగ్ లు సంతకాలు చేయగా, రాష్ట్ర విద్యుత్ డిస్కంల నుంచి చైర్మన్లు రఘుమారెడ్డి, గోపాల్ రావులు, ఎన్పీడీసీఎల్ సెక్రటరీ వెంకటేశం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రాలు సంతకాలు చేశారని బండి సుధాకర్ గౌడ్ వెల్లడించారు. ఈ ఒప్పందం చేసుకోలేదని బీఆర్ఎస్ నాయకులు చెప్పగలరా? అని ఆయన ప్రశ్నించారు. అధికారంలో ఉన్నపుడు తెలంగాణ ప్రయోజనాలను తాకట్టుపెట్టి, అధికారం పోగానే అహంకారంతో మాట్లాడటం బీఆర్ఎస్ నాయకులకు అలవాటైందన్నారు. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుంచుకోవాలన్నారు. ఇవాళ 50 లక్షల ఇండ్లకు 200 యూనిట్ల విద్యుత్ ను ఉచితంగా సరఫరా చేస్తున్నది కూడా రేవంత్ ప్రభుత్వమేనన్న విషయం మరిచిపోవద్దన్నారు. రైతులకు, ఇండ్లకు ఉచితంగా విద్యుత్ ఇస్తున్నంక ఇక మీటర్ల ప్రస్తావన ఎక్కడిదో బీఆర్ఎస్ నాయకులే చెప్పాలన్నారు. అసత్య అరోపణలు, అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే సహించేది లేదు, ఖబర్దార్ అని బండి సుధాకర్ హెచ్చరించారు.ప్రజలు బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మకుండా వాస్తవాలను తెలుసుకోవాలని ఆయన కోరారు. వాస్తవాలను వక్రీకరించి, నిజాలను దాచిపెడుతున్న బీఆర్ఎస్ నాయకులపై చట్టరీత్యా బీఎన్ఎస్ 212 సెక్షన్ కింద చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బండి సుధాకర్ కోరారు.



# జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
- **వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంపై జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేసిన కలెక్టర్**




హనుమకొండ: హనుమకొండ జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లను సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో డీఎఫ్ఓ, అదనపు కలెక్టర్ అధికారులతో వచ్చే జూన్ నెలలో వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటే కార్యక్రమం పై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు 18 లక్షలకు పైగా మొక్కలు నాటే లక్ష్యం ఉన్నట్లు తెలిపారు. ముందస్తుగానే మొక్కలు నాటేందుకు ఫిట్టింగ్ చేసి ఉంచాలన్నారు. డి ఆర్ డి ఓ లక్ష్యం 6 లక్షలు గా ఉందని తెలిపారు. మొక్కలు నాటే ప్రాంతాలను ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాఖలు నిర్దేశిత లక్ష్యాన్ని చేరే విధంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. మొక్కలు నాటిన అనంతరం జియో ట్యాగింగ్ చేయాలన్నారు. మొక్కలు నాటే ప్రాంతాన్ని కూడా వెబ్ సైట్ లో నమోదు చేయాలన్నారు. మొక్కలు నాటే ప్రాంతాలను ముందస్తుగా అధికారులు ఎంపిక చేయాలని తెలియజేశారు. మొక్కలు నాటే కార్యక్రమం పై వివిధ ప్రభుత్వ శాఖలకు నిర్దేశిత లక్ష్యాన్ని నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఆయా ప్రభుత్వ శాఖల వారీగా నిర్దేశిత మొక్కలు నాటే లక్ష్యం గురించిన వివరాలను సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మొక్కలు నాటే ప్రాంతం, నిర్దేశిత లక్ష్యాన్ని బట్టి ఎన్ని మొక్కలు నాటాలనే వివరాలను త్వరగా సమర్పించాలన్నారు. సంబంధిత శాఖల నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు సిద్ధం చేసుకోవాలని తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి అటవీ శాఖ అధికారి బి. నిఖిత మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా హనుమకొండ జిల్లాకు ఈ సంవత్సరం 18 లక్షల17వేల 400 మొక్కలు నాటే లక్ష్యంగా ఉన్నట్లు తెలిపారు. మొక్కలు నాటే ముందు ఆ ప్రాంతం ఎంపికను ముందుగా నిర్ణయించాలని అధికారులకు సూచించారు. ఎంపిక చేసిన ప్రాంతంలో ఎన్ని మొక్కలు నాటుతారనే వివరాలను అధికారులు తెలియజేయాలన్నారు. వన మహోత్సవం ప్రారంభం నాటికి నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉండాలన్నారు. మొక్కలు నాటే ప్రాంతాలను ఎంపిక చేసిన తర్వాత వర్షాలు ప్రారంభంలో మొక్కలు నాటితే పెరుగుతాయన్నారు. రానున్న రెండేళ్ల కాలానికి కూడా నిర్దేశిత మొక్కల నాటే లక్ష్యం గురించి వివరాలు అందజేయాలని, ఆ వివరాల నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలియజేశారు. నర్సరీల్లో మంచిగా పెరిగిన మొక్కలను నాటేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఏ నర్సరీ నుండి ఏ ప్రాంతంలో ఎన్ని మొక్కలు నాటుతున్నామనే వివరాలు అధికారుల వద్ద ఉండాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వన మహోత్సవం కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన తర్వాత జిల్లాలో ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి, డీఆర్డీవో మేన శ్రీను, జడ్పీ సీఈవో శేషాద్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గర్భిణులు సరైన పోషకాహారం తీసుకునే విధంగా అవగాహన కల్పించాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
- **హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా వారోత్సవాలు**




**హనుమకొండ ప్రతినిధి, మే 25,తరంగాలు :**
గర్భిణీలు సరైన పోషకాహారం తీసుకునే విధంగా అంగన్వాడీ టీచర్లు అవగాహన కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 25 నుండి 30వ తేదీ వరకు జరుగుతున్న మహిళా వారోత్సవాలను పురస్కరించుకొని పోషణ మేళా, వంటల పోటీ, గర్భిణులకు రక్త పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లా మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖలు సమన్వయంతో జరుగుతున్న ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.గర్భిణులు సరైన పోషక ఆహారాన్ని తీసుకునే విధంగా అంగన్వాడీ టీచర్లు అవగాహన కల్పించాలన్నారు. జంక్ ఫుడ్ ను తీసుకోవద్దని, ఆహార విధానంలో ఇంట్లో తయారు చేసుకున్న ఆహార పదార్థాలను తినే విధంగా అవగాహన కల్పించాలన్నారు. రోజువారి ఆహారంలో ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. రెండు సంవత్సరాల వరకు పిల్లలకు నూనె, సాల్ట్, షుగర్ ఇవ్వకూడదన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ప్రతిరోజు పోషకాహారాన్ని అందిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి విశ్వజ మాట్లాడుతూ సమతుల ఆహారం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతిరోజు వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చినప్పటి నుండి ప్రసవం అయ్యేవరకు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సరైన సమయంలో గర్భిణీలు టీకాలు వేసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని అందించిన వాళ్ళవుతారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వివిధ అంగన్వాడి కేంద్రాల నుండి పోషకాహార పదార్థాలను తయారుచేసి ప్రదర్శించగా కలెక్టర్ వాటిని పరిశీలించి వంటల పోటీని నిర్వహించారు. గర్భిణీలకు రక్త పరీక్షలను నిర్వహించి ఆరోగ్య సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపివోలు స్వరూప, స్వాతి, ఏసిడిపిఓ సింధూరాణి, సూపర్వైజర్లు, పోషణ్ అభియాన్ డిసి సుమలత, డి పి ఏ , బీసీ లు డిఎంసీ కళ్యాణి, డీహెచ్ఈ డబ్ల్యు సిబ్బంది అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ ప్రతినిధి , మే 25,తరంగాలు :**
ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మొదటి రోజు మహిళా వారోత్సవాల్లో మొదటి రోజు న్యూట్రిషన్ మిషన్ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. మహిళలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలకమని ఆమె పేర్కొన్నారు.జిల్లా కలెక్టరేట్ లో ఫుడ్ క్యాంపిషన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో స్వయం సహాయక గ్రూప్ నెంబర్లతో ప్రోటీన్ విటమి హెల్తి ఫుడ్ తయారీ చేసి వాటి యొక్క ప్రయోజనాలను జిల్లా కలెక్టర్ కు వివరించడం జరిగింది. జిల్లాలో నిర్వహించిన పోషకాహార అవగాహన కార్యక్రమాలు, వంటల పోటీలు, గర్భిణీల ఆరోగ్య పరీక్షలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.గర్భిణీలు తరచుగా హెమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకోవాలని, ఐరన్ మాత్రలతో పాటు విటమిన్-సి అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా స్థానికంగా లభించే మిల్లెట్స్, పప్పుధాన్యాలు, ఆకుకూరలు వంటి పోషకాహార ఆహారాలను ప్రతిరోజూ ఆహారంలో భాగం చేసుకోవాలని మహిళలకు సూచించారు.పోషకాహార లోపం, రక్తహీనత తగ్గించడం ద్వారా మహిళలు, పిల్లల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ గణేష్ డిఆర్ఓ విజయలక్ష్మి,జిల్లా సంక్షేమ అధికారి బి. రాజమణి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి సాంబశివరావు, మెక్మా డిఎంసి రేణుక అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ ప్రతినిధి, మే 25,తరంగాలు :**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక లో మహిళా వారోత్సవాలలో భాగంగా ఖిలా వరంగల్ మండలంలోని పుప్పాలగుట్ట పీహెచ్‌సీలో నిర్వహించిన స్క్రీనింగ్ క్యాంప్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం సందర్శించారు.ఈ సందర్శన లో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణితో కలిసి క్యాంపులో నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలను పరిశీలించారు.మహిళల ఆరోగ్య సంరక్షణ అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, ప్రతి మహిళ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ప్రత్యేకించి గ్రామీణ ప్రాంత మహిళల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచాలని, వ్యాధులను ముందస్తుగా గుర్తించి చికిత్స అందించేలా స్క్రీనింగ్ క్యాంపులను సమర్థవంతంగా నిర్వహించాలని వైద్య అధికారులను ఆదేశించారు. మహిళలకు అవసరమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ అధికారి రాజమణి,, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సాంబశివ రావు, ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
- **హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ రవి**



**హనుమకొండ ప్రతినిధి, మే 25,తరంగాలు :**
ప్రజావాణి అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ వివిధ శాఖ అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అందించిన అర్జీలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన వెంటనే సంబంధిత అధికారులను వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవిస్తూ ప్రజలు 248 అర్జీలను కలెక్టర్, అదనపు కలెక్టర్ కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ శ్రీనివాస్, ఆర్డీవో రాథోడ్ రమేష్, జడ్పీ సీఈవో శేషాద్రి, డిఆర్డీవో మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, జిల్లా అధికారులు, తహసిల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై సమీక్ష

- **ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ ఆధ్వర్యంలో సమావేశం**
- **మహిళలు, చిన్నారుల రక్షణపై దృష్టి**
- **కేసుల వేగవంతమైన విచారణకు ఆదేశాలు**



**చెన్నై, మే 25 తరంగాలు :**
తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల నివారణకు సంబంధించి సోమవారం ముఖ్య కార్యదర్శి కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీసు శాఖ, సామాజిక సంక్షేమ శాఖ అధికారులు, ప్రభుత్వ ప్రధాన న్యాయవాది పాల్గొన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. నమోదైన కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నేరస్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమాజంలో అవగాహన పెంపు కూడా అత్యంత అవసరమని సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం. మహిళలు, చిన్నారుల రక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండి సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళల భద్రత కోసం అత్యవసర సహాయ వ్యవస్థలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, చిన్నారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సమావేశంలో అధికారులు పేర్కొన్నారు. నేరాల నివారణతో పాటు బాధితులకు అవసరమైన సహాయం, రక్షణ, న్యాయ సహకారం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలు కూడా సహకరించాలని అధికారులు కోరారు.

## విజయ్‌పై పోస్టులు.. ఉద్యోగి అరెస్టు

- **చిన్నారి హత్య ఘటనపై వివాదాస్పద వ్యాఖ్యలు**
- **సామాజిక మాధ్యమాల్లో ముఖ్యమంత్రిపై దూషణలు**
- **నాలుగు చట్ట విభాగాల కింద కేసు నమోదు**



**చెన్నై, మే 25 తరంగాలు :**
విజయ్పై అభ్యంతరకర విషయాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసిన ఓ వ్యక్తిని తమిళనాడు పోలీసులు అరెస్టు చేశారు. బెంగుళూరులోని యాపిల్ సంస్థలో పనిచేస్తున్న జేమ్స్ రాజా అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కోయంబత్తూరు జిల్లా సూలూరులో జరిగిన పదేళ్ల చిన్నారి అత్యాచారం, హత్య ఘటన నేపథ్యంలో అతడు చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ముఖ్యమంత్రి విజయ్‌ను కించపరిచే విధంగా సామాజిక మాధ్యమాల్లో సందేశాలు పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. తమిళనాడులో సంచలనం సృష్టించిన చిన్నారి హత్య కేసుపై ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసుతో సంబంధం ఉన్న ఇద్దరు నిందితులను పోలీసులు ముందుగానే అదుపులోకి తీసుకున్నారు. వారిని కార్తీ, మోహన్ రాజ్‌లుగా గుర్తించారు. కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ పోలీసులు దర్యాప్తును మరింత వేగవంతం చేస్తున్నారు. ఈ ఘటనపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇలాంటి సమయంలో సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి అవుతుండటంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తిరునెల్వేలి జిల్లాకు చెందిన జేమ్స్ రాజా చేసిన సందేశాలు పోలీసుల దృష్టికి వచ్చాయి. ప్రస్తుతం అతడు బెంగుళూరులోని యాపిల్ సంస్థలో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పాలయంకొట్టై ప్రాంతానికి చెందిన అతడు గత రెండు నెలలుగా వైద్య సెలవులో ఉన్నట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. పాలయంకొట్టై పోలీసు స్థానం పరిధిలో కేసు నమోదు చేసిన పోలీసులు జేమ్స్ రాజాను అరెస్టు చేసి విచారణ చేపట్టారు. సామాజిక మాధ్యమాల వేదికగా ముఖ్యమంత్రి విజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ప్రజల్లో గందరగోళం సృష్టించేలా సందేశాలు వ్యాప్తి చేయడం వంటి ఆరోపణలపై అతనిపై నాలుగు చట్ట విభాగాల కింద కేసులు నమోదు చేశారు. అంకీయ ఆధారాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. అరెస్టు అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు అతడిని న్యాయ నిర్బంధంలోకి తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో సామాజిక మాధ్యమాల కార్యకలాపాలపై మరింత లోతైన విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే సందేశాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. చిన్నారి అత్యాచారం, హత్య ఘటన నేపథ్యంలో ఇప్పటికే తమిళనాడులో రాజకీయ ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ కేసును ఆధారంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేయడం, రాజకీయ నాయకులపై వ్యక్తిగత దూషణలకు పాల్పడడం సహించబోమని పోలీసులు స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.